# భారతరత్న గాన కోకిల శ్రీమతి M.S. సుబ్బలక్ష్మి

సంగీత ప్రపంచములో తనకంటూ ఓ స్థానాన్ని పదిలపరచుకొన్న మధుర గాయని శ్రీమతి సుబ్బలక్ష్మి. ఆమె పాడిన వేంకటేశ్వర సుప్రభాతము, అన్నమాచార్య కీర్తనలు, భజగోవింద శ్లోకాలు, విష్ణు సహస్రనామ స్తోత్రం వినని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఆమె గళ మాధుర్యము పిల్లల నుండి వృద్ధుల వరకు అందరిని మంత్రముగ్దులను చేసి కట్టి పడేస్తుంది. 1916 సెప్టెంబరు 16వ తమిళనాడు రాష్ట్రములో మధురలో M. షణ్ముఖ వడివు, సుబ్రహ్మణ్య అయ్యర్ లకు జన్మించిన ఈమె పొందని అత్యుత్తమమైన సన్మానము లేదు. జవహర్ లాల్ నెహ్రూ, జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధి, రాజాజీ, సరోజినీ నాయుడు మొదలైన వారు ఈమె పాట వినడానికి కుతూహలముతో ఈమెను ఆహ్వానించారంటే ఆమె గొప్పతనము వేరే చెప్పనవసరములేదు.

'కోకిలగాన' బిరుదుతో మొదలుబెట్టి, పద్మభూషణ్ (1954), కేంద్ర సంగీత అకాడమీ అవార్డు (1956), మెగసెసే అవార్డు (1974), భారత రత్న (1998) వంటి అవార్డులు ఆమె ఖాతాలో చేరడము వలన ఆ అవార్డులకే గౌరవము దక్కింది. తూర్పు, పశ్చిమాలలో కూడా ఆమె ప్రేక్షకులను ఒకే విధముగా తన్మయులను చేయగలిగారు. అది చాలా అరుదైన ప్రావీణ్యము. "నీ గొంతులో వీణ పలుకుతోందమ్మా" అని అప్పటి ప్రముఖ వీణా విద్వాంసుడు కారైక్కుడి సాంబశివ అయ్యర్ శ్లాఘించారు. మృదంగ ఘట విద్వాంసులు దక్షిణామూర్తి పిళ్ళై వంటివారు ఆమెను "హృదయంలోంచి, హృద్యమంగా రాగ, భావ యుక్తంగా పాడిందని ... సంగీతమంటే అదని" ప్రస్తుతించారు. ఆమె శకుంతల, మీరా వంటి చిత్రాలలో నటిగా రాణించింది. 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' సరోజినీ నాయుడు "అమ్మా నా బిరుదు నీకు ధారపోస్తున్నా" అన్నారంటే ఆమె ప్రభావము మనకు అర్ధమవుతుంది. మహాత్మా గాంధీ ఒకసారి 'హరి తుం హరో' అనే భజనను పాడమని ఆమెను అడిగితే "తనకు ఆ రచన తెలియదు. ఎవరేనా తెలిసున్నవళ్ళు పాడితే బాగుంటుందని" అన్నప్పుడు "అమ్మా మిగతా ఎవరైనా పాడేకన్నా నువ్వు చదివితేనే మధురాతి మధురంగా వుంటుంది" అన్నారట గాంధీగారు.

తెలుగు, తమిళ, మళయాల, సంస్కృత, హిందీ భాషల్లో ప్రావీణ్యత, వినమ్రత, భక్తి పారవశ్యములో తాను మునిగి శ్రోతలను కూడా మునిగేటట్లు చేయడము ఆమెలోని విశేషాలు. ఐక్యరాజ్యసమితి, కార్నెగీహాలు, మాస్కో, పారిస్ , లండన్లలో ఆమె సంగీత కచేరీలు చేసి శ్రోతలను మెప్పించారు. అసలు M.S. సుబ్బలక్ష్మి అంటే మెలోడియస్ సింగర్ సుబ్బలక్ష్మి అని ప్రశంసలు అందుకున్నారు. ఆమె పదేళ్ళ ప్రాయములో HMV సంస్థ వారు ఒక గ్రామఫోను రికార్డు విడుదలచేసారు. ఈమె పద్దెనిమిదవ ఏట మద్రాసు మ్యూజిక్ అకాడమీలో మూడు గంటల కచేరీ ఇచ్చారు. నూటికో కోటికో ఒక్కరు, ఎప్పుడో ఎక్కడో పుడతారు ఇలాంటి కళాకారులు.

అలాంటి కళాకారిణి పుట్టిన శకములో పుట్టడము మన అదృష్టము.








వివిధ సందర్భములలో శ్రీమతి M.S. సుబ్బులక్ష్మి